క్లుప్తంగా

గీతా మందిరంలో రోహిణి నక్షత్ర పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

సత్తుపల్లిటౌన్: స్థానిక గీతాజ్ఞాన మందిరంలోని శ్రీపార్థసారథిస్వామి ఆలయంలో శనివారం స్వామివారి తిరునక్షత్రం రోహిణి నక్షత్రం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. నవకలశ స్థాపన పూజలు, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం, గీతా పారాయణం చేశారు. అనంతరం నిరుపేదలకు ఆహారపొట్లాలు అందించారు.

బదిలీ సీఈవోలకు సన్మానం



సీఈవో ఏసుబాబును సత్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని రాజుపాలెం, ఎర్రుపాలెం సొసైటీల సీఈవోలు బొగ్గుల శివారెడ్డి, రామిశెట్టి ఏసుబాబులు ఎర్రుపాలెం, పెద్దగోపవరం గ్రామాల సొసైటీలకు బదిలీపై వెళ్లారు. వీరికి శనివారం ఆయా సొసైటీల్లో చైర్మన్లు వెన్నపూస కృష్ణారెడ్డి, ముల్పూరు శ్రీనివాసరావులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు, మాజీ సొసైటీ చైర్మన్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, సీఈవోలు వీరారెడ్డి, మోహన్‌రావు, నాయకులు తదితరులున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

చింతకాని: ప్రతిరోజు యోగా చేస్తే ఆరోగ్యవంతంగా ఉండటంతో పాటుగా మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ ఆదర్శ విద్యాలయం కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ తెలిపారు. మండల పరిధిలోని నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో శనివారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన మాట్లాడగా.. యోగా గురువు ఆత్మకూరి నాగేశ్వరరావు విద్యార్థులకు ఆసనాలను వేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఎర్రుపాలెం: సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెగళ్లపాడులో నిర్వహించిన స్వర్గీయ సగ్గుర్తి సంజీవరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడి చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దివ్వెల వీరయ్య, నియోజకవర్గ కార్యదర్శి గోపాలరావు, మండల కార్యదర్శి ప్రభాకర్, నాయకులు తదితరులున్నారు.

వైరా సీఐ బదిలీ

వైరా: వైరా సీఐ నునావత్ సాగర్ బదిలీ అయ్యారు. రెండున్నరేళ్ల పాటు పనిచేసిన సీఐను ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేయగా.. అక్కడ పనిచేస్తున్న వి.వినయ్‌కుమార్‌ను వైరా సీఐగా నియమించారు. మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

వానరాల హల్‌చల్..

- చేతికొచ్చిన పంటలను నాశనం చేస్తున్న కోతులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- పంటలను కాపాడుకునేందుకు అగచాట్లు

ఆరుగాలం కష్టపడి, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి, పండించిన పంటలు చేతికందే సమయంలో కోతుల పాలవుతున్నాయి. కోతుల గుంపులను తరిమేందుకు.. రైతన్నలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చేన్లో వేసిన ఏ పంటైన చేతికందే పరిస్థితి లేదు. చేన్ల చుట్టూ వలలు పెట్టినా, మైకులు పెట్టుకొని తరిమినా ఫలితం కానరాని పరిస్థితి ఏర్పడడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పలుచోట్ల రైతన్నలు గాయాలుపాలైన ఘటనలు లేకపోలేదు.



పాలడుగు సమీపంలో రహదారిపై సంచరిస్తున్న కోతులు (ఇన్‌సెట్) కోతులు తుంచేసిన పత్తి కాయలను చూపుతున్న రైతు

వైరారూరల్/కారేపల్లి: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సింహ భాగం వరి సాగుతో పాటు పత్తి, చెరకు, మిర్చితో పాటు తదితర పంటలు రైతులు సాగు చేస్తుండగా.. కారేపల్లి మండల వ్యాప్తంగా 22వేల ఎకరాల్లో పత్తి పంట, 4వేల ఎకరాల్లో మిర్చి పంట, 500ల ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు. వరి కంకి దశకు చేరగా.. పత్తి తొలి విడత తీత దశకు చేరుకున్నాయి. ఇప్పటికే వరి, మిర్చి, పత్తి పంటలు సాగు చేస్తున్న రైతులు ఆయా పంటలకు పలు రకాల తెగుళ్ల ఆశించి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని కలత చెందుతున్న నేపథ్యంలో.. కోతులు చేతికొచ్చిన అరకొర పంటలను నాశనం చేస్తున్నాయి. కంకి, తీత దశలో ఉన్న వరి, పత్తి పంటల్లో గుంపులు పడుతున్న నేపథ్యంలో.. పత్తి పిందలు, కాయలు, వరి కంకులను తూంచేస్తూ.. విధ్వంసం సృష్టిస్తున్నాయి. మొక్కజొన్న విత్తనాలు నాటిన భూమిలో ఉన్న విత్తనాలు పికి తింటుండడంతో పాటు చెరకు ఆకులు కోరికి తుంచేస్తున్నాయి. చేతికందిన పంటలు కోతులపాలు అవుతుండటంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు..

కోతుల బెడద నుంచి తమ పంటలను కాపాడాలంటూ.. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు, కనీసం కొండముచ్చులనైనా ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ అధికారులను, స్థానిక తహసీల్దార్‌ను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటికాడికి వచ్చిన పంటలు కోతుల పాలు అవుతుండటంతో... అన్నదాతలు దిగాలు పడాల్సిన పరిస్థితికి వచ్చింది. కోతుల బెడదతో.. చేన్ల గట్టున కూర్చొని దిగాలు తీయాల్సిన పరిస్థితి వచ్చింది.



కొండకొడిమలో కోతులు ధ్వంసం చేసిన చెరుకు పంట (ఫైల్)

ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

తెల్లవారుజామున లేవగానే కోతులు ఇంటి ముందే దర్శనమిస్తూ జనజీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయి. ఇళ్లలో పనులు చేసుకునేందుకు సైతం మహిళలు సంకోచిస్తున్నారు. ఎటు వైపు నుండి కోతుల మంద వచ్చి పైన పడతాయో అని ఆందోళన చెందుతున్నారు. వందల సంఖ్యలో ఉంటున్న కోతులు ఇళ్లలోకి జొరబడి బియ్యం, పప్పు డబ్బాలు, పండ్లు కూరగాయలు వంటివి తీసుకోని వెళ్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి.

రైతన్నల వినూత్న ఆలోచన

కోతులను పట్టేవారిని పిలిపించి పట్టిస్తే.. లక్షల వ్యయం అవుతుందని, ఆరుగాలం కష్టపడితినే.. ఏడాదంతా తిండిగింజలు వస్తాయని, అంత భారం భరించలేమని తలచిన సన్నకారు రైతులు, తామే సొంతంగా బోన్లు తాయరు చేసుకొని, తామే కోతులను పట్టి దూరంగా అడవుల్లో వదిలేద్దామని తలంచారు.

● కారేపల్లిలోని ఇల్లందు, కొత్తగూడెం రైల్వే ట్రాక్ వైపుల ఉన్న రైతులు కోతుల బెడద నుంచి తమ పంటలను కాపాడుకునేందుకు సుమారు 60మంది రైతులు ఒక్కొక్కరు రూ.వెయ్యి చొప్పున రూ.60వేలు జమ చేసుకున్నారు. రూ.30వేలు ఖర్చు చేసి బోన్లు తయారు చేసుకొని, రోజు 10మంది చొప్పున కోతులు పట్టే కార్యక్రమానికి నాంధి పలికారు. పట్టిన కోతులను ట్రాలీ ఆటోల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, గుండాల, కాచనపల్లి అడవుల్లో వదిలేసి వస్తున్నారు. మిగతా పైకాన్ని ట్రాలీ ఆటో రవాణా ఖర్చులకు వినియోగిస్తున్నారు.



రైతులు అమర్చిన బోనులో పడిన కోతులు

కోతులను నియంత్రించాలి..



కోతులు పంట పొలాల్లో పడి చేతికి వచ్చిన పత్తి, వరి, చెరకుతో పాటు తదితర పంటలను నాశనం చేస్తున్నాయి. దీని వలన ఆరుగాలం శ్రమించే రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గతంలో కోతులు పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుతం అటువంటి పరిస్థితులు ఎక్కడ కనబడడం లేదు. అధికారులు చొరవ తీసుకోని కోతులను నియంత్రించాలి.

– యమాల గోపాలరావు, సీపీఐ నాయకుడు, వైరా

రూ.30వేలు ఖర్చు పెట్టాం..



కోతుల బెడద నుంచి తమ పంటలను కాపాడుకునేందుకు తామే.. కోతులను పట్టేవారి అవతారం ఎత్తాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక్కొక్కరం రూ.వెయ్యి చొప్పున జమ వేసుకొని.. తామే బోన్లు తయారు చేయించి కోతులను పట్టుకుంటున్నాం. బోన్ల తయారికి రూ.30వేలు వెచ్చించాం. పట్టిన కోతులను సురక్షితంగా ఆటోట్రాలీల్లో దూరంగా అడువుల్లో వదిలిపెట్టి వస్తున్నాం.

– చెవుల లక్ష్మీనారాయణ, రైతు, కారేపల్లి

అధికారులకు విన్నవించాం..



కోతుల బెడద నుంచి పంటలను కాపాడాలని, పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపినా.. మా గోస పట్టించుకున్న నాధుడు లేడు. అప్పులు చేసి మరీ పంటలు పండిస్తే వాటిని కోతులు నాశనం చేస్తున్నాయి. చేసేదేమి లేక..తామే సొంతంగా డబ్బులు జమ చేసుకొని కోతులను పట్టి దూరంగా అడవుల్లో వదిలేస్తున్నాం.

– పాలిక కోటేశ్వరరావు, రైతు, కారేపల్లి

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలో గల మహాత్మా జ్యోతీబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బొడ్డు నాగమని తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన పోటీలో ప్రతిభ కనబరిచి.. కబడ్డీ విభాగంలో అండర్–14 లో మనోజ్, బాలు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు ఏటీపీ రంజిత్‌కుమార్, పీఈటీ భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలురతో పీఈటీ భాస్కర్

డీఏవీ రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: హైదరాబాద్ సఫల్‌గూడా డీఏవీ పాఠశాలలో ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన డీఏవీ రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 20 పాఠశాలల నుంచి 600మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి డీఏవీ స్కూల్ విద్యార్థులు చెస్, షార్ట్‌పుట్, పరుగుపందెం, ఫార్ట్‌పుల్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ తణుకు శేషసాయిశ్రీ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ టీమ్‌లో నవంబర్ నెలలో ఢిల్లీలో జరిగే డీఏవీ నేషన్ గేమ్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, తెలంగాణ జోన్ ఆర్ఎం ప్రసాద్, సాయిస్ఫూర్తి కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ట్రస్టీ బండి అన్విద, కళాశాల ప్రిన్సిపాల్ శేషారత్నకుమారిలు విజేతలను అభినందించారు.

యువతి అదృశ్యం

చింతకాని: మండలంలోని కోమట్లగూడెంకు చెందిన ఓ యువతి కానరాకుండా పోవడంతో ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోగా, ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో యువతి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వీరేందర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని జగన్నాధపురం గ్రామం వద్ద ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ముదిగొండ మండలం గంధసిరి మున్నేరు నుంచి ఇసుకను తరలిస్తుండగా.. ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

అదుపుతప్పి కందకంలోకి దూసుకెళ్లిన కారు

బోనకల్: మండలంలోని కలకోట గ్రామ సమీపంలో ఖమ్మం నుంచి మధిర వెళ్తున్న కారు శనివారం అదుపుతప్పి జాలిముడి కాలువ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న కందకంలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారుకు ఎలాంటి నంబర్ ప్లేట్ లేకపోవడం, కారులో ప్రయాణిస్తున్న వారు ఎవరు సంఘటన స్థలంలో లేకపోవడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించాలి

మధిర: రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్లను సకాలంలో చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబయ్య, మీరాఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మధిర తహసీల్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 నెలల నుంచి పెన్షనరీ బెనిఫిట్స్ అందక రిటైరైన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మానసిక ఆందోళన, ఆనారోగ్యంతో కొంత మంది మరణించారని తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మొండ్రు ఆశీర్వాదం, సీనియర్ నాయకులు భాస్కర్‌రావు, సూర్యనారాయణ, ప్రభాకర్, సాంబశివరావు, బుచ్చిబాబు, అమరలింగం, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



హరీష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, టీజీఐడీసీ చైర్మన్ విజయబాబు

సత్తుపల్లిరూరల్: కాకర్లపల్లికి చెందిన హెచ్.హరీష్ అనారోగ్యానికి గురికావటంతో శనివారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడ్పుగంటి రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయల లలితమ్మకు మంత్రి పొంగులేటి నివాళి..

కొణిజర్ల: మండలంలోని మల్లుపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాయల పుల్లయ్య మాతృమూర్తి లలితమ్మ ఇటీవల మృతి చెందగా శనివారం రాత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లలితమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె నారాయణరావు, మాజీ ఎంపీపీ మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు..



ఉద్దండు సాహెబ్‌ను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

మధిర: మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన ఇటీవల అనారోగ్యానికి గురైన షేక్ ఉద్దండు సాహెబ్‌ను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి గోపాలరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మనోహర్, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు మురళి, సైదులు, డివిజన్ నాయకుడు రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం జిల్లా వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలిగా సత్యవతి



పాగా సత్యవతి, వెంకటలక్ష్మి

కల్లూరురూరల్: మధ్యాహ్న భోజన పథకం జిల్లా వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలిగా పాగా సత్యవతి, సహాయ కార్యదర్శిగా ఖమ్మంపాటి వెంకటలక్ష్మిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం తల్లాడలో జరిగిన జిల్లా మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ మహాసభలో సత్యవతి, వెంకటలక్ష్మీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, మండల సీపీఐ కార్యదర్శి దామాల దయాకర్ అభినందించారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా..

ఏన్కూరు: ఏన్కూరు మండలం నాచారంలోని అద్భుత వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి పరిచి పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం ఆయన కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శేషయ్య, నాయకులు స్వర్ణ నరేందర్, గుత్తా వెంకటేశ్వరరావు, మాలోత్ విష్ణుష్, వేముల కృష్ణ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ లచ్చిరామ్‌నాయక్, వక్కంతుల నాగార్జున, ప్రభావతి రెడ్డి, ధర్మారావు, భువనేశ్వరరాజు, సత్యనారాయణ, నవీన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దంపతులు

విద్యుత్ శాఖ.. పొలం బాట

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడులో శనివారం విద్యుత్ శాఖాధికారులు పొలం బాట నిర్వహించారు. పంటల సాగులో విద్యుత్ వినియోగంపై స్థానిక విద్యుత్ ఏఈ జి.అనూష రైతులకు అవగాహన కల్పించారు. రైతులు విధిగా విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని, విద్యుత్ వాడకం విషయంలో భద్రత పాటించాలన్నారు. విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు పొందిన రైతులు మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మెన్ రత్నాకర్ రావు, లైన్‌మెన్ నారాయణరెడ్డి, ఏఎల్ఎం వంశీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఈ అనూష

స్నేహితుల ఔదార్యం



నగదు అందిస్తున్న స్నేహితులు

కారేపల్లి: తమతో పాటు కలిసి చదువుకున్న మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న సహచరులు చలించిపోయారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని తలిచారు. కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామానికి చెందిన సిరికొండ కృష్ణారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, కారేపల్లి హైస్కూల్ 2000–01 విద్యాసంవత్సరంలో చదివిన కృష్ణారావు స్నేహితులు రూ.13వేలు నగదును శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో షరీఫ్ వారి మిత్ర బృందం పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి



కూల్చివేసిన ప్రార్థనామందిరాన్ని పరిశీలిస్తున్న సీపీఎం బృందం

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ప్రార్థనామందిరాన్ని కూల్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని సొసైటీ అధ్యక్షుడు మాదినేని వీరభద్రం, మండల పాస్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం బృందం శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రదేశంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, బీటీరోడ్ల నిర్మాణాలు చేపట్టడంతో భూములకు ధరలు పెరిగాయి. దీంతో 401 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నంలో ప్రార్థనామందిరాన్ని కూడా కూల్చివేసి ఉంటారని పలువురు ఆరోపించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదాం

పెనుబల్లి: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఈనెల 16న మండలకేంద్రంలోని వీఎంబంజరు పట్టణంలో నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. శనివారం పెనుబల్లిలో చలమాల సూర్యనారాయణ భవనంలో.. చీపి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కార్మికవర్గ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో చిట్టిమోదు కృష్ణయ్య, చంద్రు, క్రాంతి, కొప్పుల రామకృష్ణ, వంగా కృష్ణ, శాంతకుమారి, రవీంద్ర, తాండ్ర రాజేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలమాల విఠల్‌రావు



బురదమయంగా మారిన జీవీమాల్ పక్కన వీధి

సత్తుపల్లిటౌన్: ఈ వీధిలోకి నడిచి వెళ్లాలంటే నాట్లు వేయాల్సి వస్తోంది. చినుకు పడితే చాలు రోడ్డంతా చిత్తడి చిత్తడిగా మారి అధ్వానంగా తయారవుతుంది. పట్టణంలోని జీవీమాల్ పక్క వీధి వాసులు బురద, నీటి గుంతలతో ఉన్న ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోందని వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు సిమెంట్‌రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

విలీన గ్రామ పంచాయతీల

సమస్యలు పట్టించుకోరా..

వార్డు ఆఫీసర్ల కొరతతో పేరుకుపోయిన సమస్యలు

కల్లూరురూరల్: కల్లూరు మున్సిపాలిటీలో విలీనమైన ఏడు గ్రామ పంచాయతీల సమస్యలను వార్డు ఆఫీసర్లు పట్టించుకోవటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. నూతనంగా ఏర్పాటైన కల్లూరు మున్సిపాలిటీలో కప్పలబంధం, పుల్లయ్యబంజరు, తూర్పు లోకవరం, పడమర లోకవరం, కిష్టయ్య బంజరు, హనుమాతాండ, వాచ్యనాయక్‌తండా గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఆ పంచాయతీ కార్యదర్శులకు వార్డు ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారు. 20 వార్డుల పరిపాలనను ఉన్న ఏడుగురు వార్డు ఆఫీసర్లతో పనులు కొనసాగిస్తున్నారు. దీంతో విలీన పంచాయతీల ప్రజలతో పాటు మిగిలిన వార్డుల ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో.. గ్రామాల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు, డ్రెయిన్లలో పూడికతీత పనులు, చెత్త సేకరించే ట్రాక్టర్ల నిర్వహణ పనుల నిర్వహణ సక్రమంగా లేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 20 వార్డుల్లో పనులు పరిరక్షించలేక ఉన్న ఏడుగురు వార్డు ఆఫీసర్లు సతమతమవుతున్నారు. వెంటనే వార్డు ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసి మున్సిపల్ పరిపాలన అందే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం